


# ఈనాటి మహిళ

సి. ఆనందరామం

**బి.ఏ.** డిగ్రీ అందుకున్న రోజున విమల ఆనందానికి అంతులేదు. తను ఆధునిక మహిళ — వెనుకటి కాలం అమ్మమ్మల్లా కాదు. తన భావాలు, తన ఆదర్శాలు, తన ఆశయాలు అన్నీ ఆధునికంగానే ఉంటాయి. మొత్తం తన జీవితమే వేరుగా ఉంటుంది. కలలలో తేలిపోతున్న విమలను నేలమీదకు లాక్కొచ్చాయి తండ్రి మాటలు.

"అమ్మా! నీకు పెళ్ళిచేసేస్తే ఇంక నాకు నిశ్చింత—సంబంధాలు చూస్తున్నాను—ఒక్కటీ కుదరటంలేదు."

పెళ్ళా? ఇంతా బి.ఏ. పాసయి పెళ్ళి చేసుకు కూర్చోవటమా? కొన్ని క్షణాల లోనే విమలకు అర్థమయిపోయింది. బి.ఏ. పాసవటం పెద్ద ఘనకార్యంకాదనీ తనలా బి.ఏ.లు పాసయిన ఎంతోమంది ఆడపిల్లలు పెళ్ళిచేసుకుని ఇంట్లో కూచుంటున్నారు అనీ—

"నాన్నా! నేను పెళ్ళి చేసుకోను—చదువుకుంటాను" అంది. తన జీవితం అతి మామూలుగా గడిచిపోవటం ఇష్టం లేక—

"చదువుకున్నాక, అప్పుడైనా పెళ్ళి తప్పదు కదా! జీవితాంతం పెళ్ళిలేకుండా ఉండిపోవుకదా?"


విమల ఆలోచనలో పడింది. అస్సలు పెళ్ళి లేకుండా ఒక్కతే ఉండిపోవాలంటే అహఁ! వద్దు. తనకలాంటి ఆలోచనలు లేవు. అంచేత చచ్చినట్లు తండ్రిమాటలకు తలవంచింది. మొదటిసారి అలా తలవంచటం అంత కష్టమనిపించలేదు. ఇక రెండవ ఘట్టం ప్రారంభమయింది. పెళ్ళికొడుకు తనను చూసుకోవటానికి రావడమూ, తను సిగ్గుపడుతూ అతని ముందు కూచోవటమూ ఇదంతా చికాకు అనిపించింది.


"ఈ పాత పద్ధతుల్లో పెళ్ళిచూపులు చాలా చికాకు వ్యవహారం నాన్నా! సంతలో పశువును పరీక్షచేసినట్లు ఎవరెవరో వచ్చి పరీక్ష చేస్తుంటే అదంతా భరిస్తూ కూచోవటం నన్ను నేను చిన్నబుచ్చుకోవడమే అవుతుంది. ఇద్దరమూ ఏ హోటల్లోనో, లేకపోతే ఏ పార్కులోనో మనసులు విప్పి మాట్లాడుకొని ఒకరి విషయాలు మరొకరం తెలుసుకుంటాం!"

విమల మాటలు వింటూనే హడలిపోయింది తల్లి. బుగ్గలు నొక్కుకుని "హవ్వ! ఇదేం పోయేకాలమే! నా దగ్గిర అంటే అన్నావు కాని మరెవరి దగ్గిరా అనకు! ఇంత బరితెగించిన పిల్లేమిటి? అని నానా మాటలూ అంటారు. ఈ జన్మలో ఇంక నీకు పెళ్ళికాదు—" అంది.

రెండవసారి తలవంచటం విమలకు కాస్తకష్టమే అయింది. కాబోయేభర్తతో ఫ్రీగా మాట్లాడటం బరితెగించడం ఎలా అవుతుందో ఎంత తలపగులగొట్టుకున్నా అర్థంకాలేదు, ఆ ఆధునిక కన్యామణికి—పెళ్ళివారు వచ్చారు—యథాప్రకారంగా వచ్చి వాళ్ళ ముందు కూచోవలసివచ్చింది. ఎటొచ్చీ పట్టుబట్టి పోట్లాడి కింద చాప మీద కాకుండా కుర్చీలో కూచుంది. ధైర్యంగా పెళ్ళికొడుకుతో మాట్లాడుదామనుకున్న విమల తనకు తెలియకుండానే తనలో జీర్ణించుకుపోయివున్న ఏ సంస్కార బలానికో లొంగిపోయి తల దించేసుకుంది. "అంత సిగ్గయితే ఎలాగమ్మా!

ఏ పిరికితనం బయటపడే దెప్పుడు?




ఒక్కసారి అబ్బాయిని చూసుకో!" అని మొగపెళ్ళి తరఫువా ళ్లెవరో హాస్య మాడితే ఎలాగో తలెత్తిచూసి అంతలో తల దించుకుని లోపలికి వచ్చేసింది. అప్పుడు స్థిమితంగా తన ప్రవర్తనకు తనే ఆశ్చర్యపోయింది. ఇదేమిటి? తను అచ్చు పాతకాలపు చదువుకోని ఆడ పిల్లలా ప్రవర్తించింది. తన బి.ఏ. డిగ్రీ, ఆధునిక భావాలు అన్నీ ఏమయిపోయి నట్లు, అనుకొని ఎంతోసేపు మథన పడింది...

ఆ తరువాత మూడో ఘట్టం మరింత దుర్భరంగా తయారయింది విమలకి.

"వాళ్లు పదివేలకు తగ్గమంటు న్నారు!" అన్నాడు తండ్రి.

"కట్నమే పదివేలయితే లాంఛనాలతో పెళ్ళి ఖర్చులు ఎంత లేదన్నా మరో ఐదు వేలుంటాయి. దీని పెళ్ళికే ఇంత ఖర్చు చేస్తే ఇక మిగిలిన పిల్లల సంగతేమి టండీ?" బాధపడుతూ అంది తల్లి.

"ఏదో చూడాలి! పదివేలయినా ఇవ్వకుండా ఓ మోస్తరు సంబంధమైనా రావటంలేదు. డబ్బుకోసం చూచుకొని దాని బ్రతుకు పాడుచెయ్యగలమా?"


'ఖర్మ' అని తల కొట్టుకుంది తల్లి. ఇంక భరించలేక పోయింది విమల. "కట్నం తీసుకునే వాడిని పెళ్ళిచేసుకోను" అంది రంగంలోకి వచ్చి.


అసలే సమస్యలతో చికాకుగా ఉన్న తండ్రి "నోరు మూసుకో!" అని ఒక్క కసురు కసిరి "లోకంతో పాటు మనము పోవాలి. అందరూ కట్నాలు తీసుకుని పెళ్ళిళ్ళు చేసుకోటంలేదా? సుఖంగా కాపురం చెయ్యటంలేదా? మొత్తం సమాజం మారాలికాని, మనం ఒక్కళ్ళం మానేస్తే ఏమవుతుంది? మన బ్రతుకే బండలవుతుంది. ఈ విషయాల్లో నువ్వు కల్పించుకోకు!" అన్నాడు.

"ఎవరి మటుకు వాళ్ళే మనంఒక్కరం మారితే ఏమవుతుంది?" అనుకుంటే సమాజం ఎలా మారుతుంది? బతుకు బండలయితే అవుతుంది. ఏ సమాజంలో నయినా సంస్కరణకు దారితీసినవ్యక్తులు మొదట్లో బలికాక తప్పదు. ఆ తరువాత ఆ దారిలో ఆనందంగా అనేకమంది నడుస్తారు" అనాలనుకుంది. కానీ, కోపంతో, క్షోభతో, చికాకుతో మండి పోతున్న తండ్రి ముఖం చూస్తూ ఏమీ మాట్లాడలేకపోయింది. మధ్యవర్తులూ తండ్రికీ మధ్య పక్కా వ్యాపార సరళిలో ఇచ్చిపుచ్చుకోవటాల విషయంలోబేరాలు సాగుతుంటే చెవులప్పగించి వింది. డబ్బు సమకూర్చుకోవటానికి తండ్రి అవస్థ పడుతుంటే కళ్ళారాచూస్తూభరించ లేకపోయింది. పెళ్ళంటే ఏమిటి? ఇలా జరిగే పెళ్ళిళ్ళలో పీడించే మొగపెళ్ళి వాళ్ళకి ఆనందోత్సాహ లుంటాయేమో కాని, కన్నవారి అవస్థలు చూస్తోన్న కన్నెపిల్లకేం ఉత్సాహం ఉంటుంది? ఈ పెళ్ళి జరగకపోతేనేం? ఇలా సాగి పోయేవి విమల ఆలోచనలు... కథలలో నవలలలో చదివిన "అబ్బ! నువ్వెంత అందంగా వున్నావు?" "నీలాంటి భార్య దొరకటం నా అదృష్టం!" "మిమ్మల్ని వదిలి నేనొక్క నిమిషమైనా ఉండలేను" లాంటి సంభాషణలు సరదాగా ఊహించు కుందామన్నా సాధ్యం కావటంలేదు. మనసు ఏదోచెయ్యాలని మథనపడిపోతూ ఏం చెయ్యలేక విలవిల లాడిపోతోంది. ఉరకలు వేసే ఆధునికభావాలు జీర్ణించుకు పోయిన అబలత్వం ముందు వీగి పోతున్నాయి.

మధ్యవర్తి వచ్చి "కట్నంలో ఐదు వేలు అడ్వాన్సుగా ముందే ఇయ్యా మన్నారు. పెళ్ళి ఖర్చులకి కావాలిట!" అన్నాడు.ఇయ్యనంటేఎంకోపాలొస్తాయో యని తండ్రి ఇచ్చేశాడు. చూస్తున్న కొద్దీ మనసు రగిలిపోతోంది విమలకి. పెళ్ళికి తల్లి పట్టుచీరలు కొని "చూడు విమలా! ఈ చీరలు బాగున్నాయా?" అని అడుగుతోంటే, "చీరెలూ, నగలూ తప్ప ఆడదానికి కావలసింది మరోటిలేదు

మీ పిరికితనం బయటపడేది ఎప్పుడు?




కాబోలు. ఈనగలన్నింటినీ మించిన నగ అత్మాభిమానం అని స్త్రీ జాతి ఎప్పటికి గుర్తిస్తుందో గదా?" అనుకుంది తనలో తను.

ముహూర్తం రోజు వచ్చింది. విమలను పెళ్ళికూతురుగా అలంకరించి పీటల మీద కూచోబెట్టారు. పెళ్ళికొడుకు ఆనందంగా అందంగా వున్న విమలను చూస్తున్నాడు. విమల పెళ్ళికొడుకును పరిశీలనగా చూసింది. ఆ చూపులకు చెదిరాడా నవయువకుడు. మేళతాళాలు మోగుతున్నాయి. పురోహితుడు తనకే అర్థం కాకుండా దీర్ఘాలు తీస్తూ మంత్రాలు చదివేస్తున్నాడు. సరిగా మంగళసూత్రధారణ సమయంలో గొడవ ప్రారంభమయింది. "ఆగండి! మంత్రాలు ఆపండి! ఒరేయ్ నువ్వాతాడు దాని మెడలో కట్టకు!" అని అరిచాడు మావగారు. పితృవాక్య పరిపాలకుడైన ఆ 'బుద్ధి'మంతుడు మంగళసూత్రాలు చేతిలో పట్టుకొని తండ్రివంక చూశాడు. 'ఏం చెయ్యమంటారు' అన్నట్లు—

"కట్నం పదివేలిస్తానని ఐదువేలు చేతిలోపెట్టి ఇంకా కల్లబొల్లి కబుర్లుచెబుతావా?" హుంకరిస్తున్నాడు కాబోయే మావగారు. తండ్రి ఆయనను చేతులు పట్టుకొని ప్రాధేయపడుతూ "బావగారూ! నా మాట నమ్మండి. నేనుఅబద్ధమాడటం లేదు. ఆ మధ్యవర్తి వచ్చి మీరు అడ్వాన్సుగా ఇమ్మన్నారని ఐదువేలూ పట్టుకుపోయాడు. వెంటనే ఇవ్వలేను కాని, నిదానంమీద ఆ ఐదువేలూ సర్దుతాను. ఆ మధ్యవర్తి సంగతి తేల్చుకుందాం, పీటల మీద పెళ్ళి ఆపకండి!" అని బతిమాలుతున్నాడు—

ఆయన అదేమీ వినిపించుకోకుండా తండ్రి చేతులు తోసిపారేసి, కొడుకు చెయ్యిపట్టుకులేవదీసి "పదరా పోదాం!" అన్నాడు. ఆ పుత్రసత్తముడు చేతిలో మంగళసూత్రాలు క్రిందపారేసి పసుపు బట్టలతోనే, తలకు బాసికంతోనే, తలపై జీలకర్ర బెల్లంతోనే తండ్రి ననుసరించాడు. పెళ్ళిపందిట్లో ఏడుపులు, తిట్లు, అరుపులు, గోల, గందరగోళం—మొగ పెళ్ళివారు అప్పటికప్పుడు ప్రయాణమై బయలుదేరారు, ఎవరెంత ఆపినా ఆగకుండా—ఆడపెళ్ళివారి తరఫున ఒక హీరో ఉన్నాడు. అతనికి ఉద్యోగం దొరక్క సంఘసేవా కార్యక్రమాలు చేస్తున్నాడు. ఆ హీరో తన మిత్ర బృందాన్ని వెంటబెట్టుకొని "ఉండండి! ఆ పెళ్ళికొడుకును నేను ఈడ్చుకొచ్చి వాడిచేత ఈ పెళ్ళికూతురి మెడలో తాళి కట్టిస్తాను" అని ఝామ్మంటూ స్టేషన్‌కి బయలుదేరాడు. వాళ్ళంతా రైలెక్కబోతున్న పెళ్ళికొడుకుచుట్టూచేరి, "మర్యాదగా వెనక్కువచ్చి పిల్లమెళ్ళో తాళి కడతావా? లేకపోతే బడితె పూజ చెయ్యమంటావా? అని హీరాయిక్‌గా" కర్రలాడించే సరికి ఆ ధీరోదాత్తుడు జావగారిపోతూ 'నాన్న'! నేనువీళ్ళతో తన్నులు తినలేను. ఆఅమ్మాయిమెడలో తాళికట్టేస్తాను. కావాలంటే పెళ్ళయ్యాక దాన్ని నువ్వు తందువుగాని—" అని తండ్రి చెయ్యి విడిపించుకొని హీరో బృందం వెనకాల వచ్చేశాడు. హీరో రొమ్ము విరుచుకొని మీసం మెలేసుకుంటూ పెళ్ళికొడుకుని వెంటతీసుకొచ్చే సరికి పందిట్లో పెళ్ళికూతురు లేదు. యే నూతిలో దూకిందో, ఏ అఘాయిత్యం చేసిందో అని అందరూ గాభరాపడిపోతుంటే, పెళ్ళిబట్టలు విప్పిపారేసి మామూలు బట్టలతో చిరునవ్వులు చిందిస్తూ వచ్చింది విమల. "హమ్మయ్య" అనుకున్నారు అందరూ— "ఊ కానిచ్చెయ్యండి, పెళ్ళి" అన్నారు.

"పెళ్ళా? ఎవరికి? ఎవరితో?" తాపీగా అడిగింది విమల నిటారుగా నిలబడి. హీరో సగర్వంగా ముందుకువచ్చి "నేను మీ పెళ్ళికొడుకుని లాక్కొచ్చేశానండీ! ఇక మీ పెళ్ళి జరిగిపోతుంది. పాపం! బెంగపడిపోయారులా ఉంది. మరేం భయంలేదులెండి!" అన్నాడు. విమల ఈసడింపుగా "చాల్లేవయ్యా హీరో!



నువ్వు గాడిదను తోలుకొచ్చినట్లు పెళ్ళికొడుకును తోలుకొస్తే ఆ గాడిదచేత తాళి కట్టించుకోవటానికి నేను మరో అడ్డగాడిదననుకొంటున్నావా? అటు నాన్న లాక్కెళితే పోయాడు! ఇటు నువ్వీడ్చుకొస్తే వచ్చాడు! వీడిచేత తాళి కట్టించుకుని 'హా! నాజన్మ తరియించెన్—' అని మురిసిపోతూ నీకు కృతజ్ఞతాపూర్వక వందనాలర్పించాలా నేను? ఎలాగో ఒక్కలాగ తాళిబొట్టు ముడేయించుకుంటే సరిపోతుందా? ఆ తరువాత జీవితమంతా ఈ త్రాష్టుడితో ఎవడేడుస్తాడు? 'నా అదృష్టం! వీడి అసలు రంగు మూడు ముళ్లూ పడకముందే బయటపడిందని నేను మురుస్తూంటే, వీడిని లాక్కొచ్చి నా బ్రతుకు నాశనంచేస్తానంటావు, ఇదెక్కడిహీరోయిజమయ్యా! మంగళసూత్రాలు మెడలోపడితే చాలు, ఆడదాని బ్రతుకు ధన్యమయిపోతుంది, అనుకునే అభ్యుదయవాదివా నువ్వు? పెళ్ళంటే మాంగల్యధారణ కాదయ్యా హీరో మహాశయా! తరువాత ఆ మొగవాడూ, ఆడదీ కలసిమెలసి ఒక గూడు క్రింద బ్రతుకంతా వెళ్ళదీయాలి. వాడిని వాళ్ళ నాన్న పక్కనే నిలబెట్టు. నా దరిదాపులకు రానీయకు!" అంది.

బిత్తరపోయాడు హీరో, తన హీరోయిజమంతా ఇలా వేస్టయిపోయినందుకు. విమలమీద కోపంకూడ వచ్చింది ఆ హీరోకి. "ఆదర్శ భారతనారి కాదు!" అనుకున్నాడు కసిగా. అమ్మలక్కలంతా "హౌరా!" అని సామూహికంగాబుగ్గలు నొక్కుకొని "ఈ జన్మలో దీనికి పెళ్ళి కాదు—" అని తీర్మానించేశారు. ఆ తీర్మానానికి విమల బెదిరిపోలేదు సరికదా మహంకాళిలా మండిపడింది.

"పీడా పోతూంది పెళ్ళి కాకపోతే! బాగా చదువుకుంటాను. మొగవాళ్ళకంటే గొప్పగా పే—ద్ద ఆఫీసర్ని ఐపోతాను. అంతగా అవసరమయితే అప్పుడే ముసలాడినో, ముతకాడినో నామమాత్రపు మొగుడిగా చేసుకుంటాను. నాపనులన్నీ చూడటానికి సమర్థుడైన ఓ పర్సనల్ సెక్రటరీని ఉంచుకుంటాను. ఈ దౌర్భాగ్యుడితో, ఈ చవటతో, ఈ పిరికి సన్నాసితో తాళి కట్టించుకోవటమే పెళ్ళయితే నాకా పెళ్ళి అక్కర్లేదు. పీటలమీద పెళ్ళి తప్పిపోయినంత మాత్రాన జీవితంనాశనమయినట్లు కుమిలిపోయే ఆడపిల్ల లెక్కడయినా ఉంటే వుండనీ, నేను మాత్రం అలాంటిదాన్ని కాను."

పిడుగులు కురిపిస్తున్నట్లుగా గడగడ కురుస్తోన్న ఆ మాటలవర్షం ఆగీ ఆగకుండానే, పోలీసులు వచ్చి పెళ్ళికుమారుణ్ణీ అతని తండ్రిగారినీ అరెస్టుచేశారు, "ఇంత బాహాటంగా కట్నంకోసం అల్లరి పెడతారా?" అని. "ఈవిడ ఏ నుయ్యో గొయ్యో చూసుకోవటానికి వెళ్ళిందనుకొన్నాను. ఫోన్‌చేసి పోలీసులను పిలవటానికి వెళ్ళిందా? ఓరి దేవుడా? నేను హీరోను అవునో కాదో గాని, ఈవిడ మాత్రం ఈనాటి మహిళ!" అని నివ్వెరపోయాడు హీరో, తలెత్తిన నారీ స్వరూపాన్ని చూసి—

